క్లుప్తంగా

పెన్‌కాక్ సిలాట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారి రాజు

నంద్యాల(న్యూటౌన్): సౌత్‌జోన్ పెన్‌కాక్ సిలాట్ పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు గురువారం క్రీడాకార్యాలయంలో అభినందించారు. జిల్లా పెన్‌కాక్ సిలాట్ సంఘం కార్యదర్శి నూర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులకు ఈనెల 19, 20 తేదీల్లో తమిళనాడులోని తరుచూర్‌లో జరిగే పోటీల్లో ఎస్‌ఎండీ అయాన్, ఫిజనుల్లా, పవన సాయి, నానివర్ధన్, అలీషా, శ్రీలస్య, మధు జాహ్నవి, మహిధర్, నువాన్, అమీర్, అయాజ్ పాల్గొంటారని తెలిపారు.

వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయండి



కుందూ బ్రిడ్జి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందమూరినగర్‌కు వెళ్లే రహదారిలో కుందూనదిపై నిర్మిస్తున్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు పుల్లా నరసింహులు, నందమూరినగర్ నాయకులు చైన్‌సింగ్ డిమాండ్ చేశారు. గురువారం బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2017లో రూ.7కోట్లతో బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించగా.. ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. నాయకులు మాబూవలి, జాకీర్, అంజి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న సీఐ

శిరివెళ్ల: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సీఐ దస్తగిరిబాబు అన్నారు. గురువారం ఇసుకపల్లెలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయవద్దన్నారు. బాలికలను చదివించి ప్రయోజకులను చేసిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని, గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న పీరయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

85 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తస్లిమా సుల్తానా

చాగలమర్రి: ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని పెద్దవంగలి గ్రామ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 104 కార్యక్రమంలో సుమారు 85 మందికి వైద్య సేవలు అందించినట్లు ప్రభుత్వ వైద్యురాలు తస్లిమా సుల్తానా తెలిపారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చిన్న పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు చెప్పారు. ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ కవిత, ఏఎన్‌ఎం భూదేవి, 104 సిబ్బంది హరినాథ్, ఆశ కార్యకర్తలు పద్మావతి, రజని తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): కొత్తగా రూపాంతరం చెందిన పాఠశాలల నిర్మాణానికి అనుగుణంగా గ్రాంట్ విడుదల చేయాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత విద్యాసంవత్సరం మెగా పేటీఎం 1.0 కింద ప్రభుత్వం ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. అలాగే మెగా పేటీఎం 2.0 కూడా కాంపోజిట్ గ్రాంట్ కింద పేటీఎం మొత్తాన్ని హెచ్‌ఎంల ఖాతాలకు జమ చేయాలని కోరారు. పాఠశాలల నిర్మాణం జరిగిన తర్వాత భౌతిక మౌలిక వసతులకు ఈ మొత్తం సరిపోదన్నారు. కాంపోజిట్ గ్రాంట్‌లో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌కు సంబంధించి ప్రతి ఉపాధ్యాయుడికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశా. నాయకులు చెన్నకేశవులు, సుబ్బయ్య, పురుషోత్తమరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్, బసవరాజు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



నీలివీధిలో వెలసిన బీఫాతిమా తల్లిపీరు



గాంధీచౌక్‌లో హసన్ పీర్లు

నంద్యాల(వ్యవసాయం): శాంతి స్థాపన కోసం 14 శాతాబ్దాల క్రితం జరిగిన చరిత్రాత్మక యుద్ధాల్లో అమరులైన వీరుల సంస్మరణార్థం మొహర్రం పూజలను ముస్లింలు ఘనంగా జరుపుకుంటారు. మొహర్రం నెలతో ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. అందుకే ఈ మాసాన్ని షాహిద్ మాసంగా ముస్లింలు పిలుచుకుంటారు. వాస్తవానికి విషాధ రోజులు అయినప్పటికీ తెలుగు నెలల్లో పీర్ల పండుగగా పిలుస్తారు. పట్టణంలో పీర్ల పండుగను మతసామరస్యానికి ప్రతీకగా అన్ని మతస్తుల వారు అత్యంత భక్తిశ్రద్ధలతో పీర్లను పూజిస్తారు. పట్టణంలో దాదాపు 25కు పైగా పీర్ల చావిళ్లు (మకాన్) ఉన్నాయి. వీటిని ఇప్పటికే ముస్తాబు చేశారు. పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు, ఆధ్యాత్మిక గ్రంథాలను పఠిస్తారు. మకాన్‌లలో పీర్లను వివిధ రకాల పుష్పాలు, బాసికం, విద్యుద్దీపాలంకరణతో అలంకరించబడ్డాయి. పట్టణంలో నీలివీధిలో బీఫాతిమ (తల్లిపీరు), ముల్లాన్‌పేటలో షైజ్‌జఫార్‌వలి దర్గా వద్ద, హుసేన్‌ఆలం, కల్పనా సెంటర్‌లో ఇమాం ఖాశీం, చాంద్‌బాడలో అలీఅక్బర్, ఇమాంఖాశీం, అలీఅబ్బాస్, మాల్దారిపేటలో మౌలాలిస్వామి, నడిగడ్డ, తొట్టిబావి వద్ద ఉజాలా తాబుచ్, గాంధీచౌక్‌లో హసన్, జమాల్‌బాషా దర్గా వద్ద అలీఅక్బర్, అలిఅక్షర్, బాదూల్‌సాహెబ్‌లు, సాదిక్‌నగర్‌లో అలీఅక్బర్, ఊహన్ అలీం, మౌలాలిస్వామి, నూనెపల్లె, ఏకలవ్యనగర్‌లో దస్తగిరిస్వామి, ఇమాం ఖాశీం, మౌలాలిస్వామి పీర్లు పూజలు అందుకుంటున్నాయి. ముజావర్లు ఉదయం, సాయంత్రం పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఫాతెహాలు నిర్వహిస్తారు. మొహర్రం 7వ రోజు గురువారం చిన్నసరిగెత్తు, 9వ రోజు శనివారం పెద్ద సరిగెత్తు ప్రాధాన్యత కలవి. ఆయా రోజుల్లో భక్తులు ఉదయం నుంచే మొక్కులు ఉన్నవారు స్వామి వారికి పూలహారాలు, బాసికాలు, టెంకాయలు, మలీదావంటి ప్రసాదాలను సమర్పిస్తారు. రాత్రి పీర్లచావిడి ఎదురుగా అగ్నిగుండాలు చేసి అర్ధరాత్రి భక్తులు అగ్నిగుండాల్లోకి ప్రవేశిస్తారు. కొన్ని పీర్లు అర్ధరాత్రి దివిటీలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజు ఆదివారం సాయంత్రం షాదత్ (ఏటికి తరలింపు)



అగ్నిగుండం సిద్ధం చేసిన దృశ్యం

కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం పట్టణంలోని అన్ని పీర్లు కల్పనా సెంటర్ వద్దకు చేరుకొని గాంధీచౌక్, బంగారు అంగళ్లు, పెద్దబండ, ఆర్టీసీ బస్టాండ్, రాణిమహారాణి థియేటర్ వద్ద ఉన్న కుందూనది వద్ద ముగిస్తారు. తెల్లవారుజాము నుంచే పీర్లు పట్టణంలో గ్రామోత్సవంగా బయల్దేరి మధ్యాహ్నం మకాన్‌లకు చేరుకొని సాయంత్రం ఆధ్యాత్మిక చింతనతో ఉపవాసాలతో మహిళలు ఉండి షాదత్ కార్యక్రమం అనంతరం ఉపవాసాన్ని విడిచిపెడతారు. ఊరేగింపును చూడటానికి పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో పాల్గొంటారు.

నీటి విడుదలపై నిర్లక్ష్య వైఖరి వీడాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

గోస్పాడు: ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి రైతులకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు సురేష్ అన్నారు. మండలంలోని గోస్పాడు, ఎం.చింతకుంట్ల, జూలేపల్లి గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ శ్రీశైలంలో నీటిమట్టం 875 అడుగులు దాటినా.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికే పైర్లు సాగుచేసిన రైతులకు సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలానికి వరద నీరు ఉధృతంగా వస్తున్నా తాగు, సాగునీరు అవసరాలను తీర్చలేకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలోని తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్, హెచ్‌ఎన్‌ఎస్, కేసీ కాలువల ద్వారా జిల్లా ప్రాజెక్టులు చెరువులు కుంటలు ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. ఈనెల 4వ తేదీన పోతిరెడ్డిపాడు వద్ద గేట్లు ఎత్తేందుకు తరలి రావాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయరాం

నంద్యాల(న్యూటౌన్): విపత్కర పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలని విద్యార్థినులకు సీఐ జయరాం గురువారం అవగాహన కల్పించారు. పట్టణంలోని న్యూక్లియస్ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ జయరాం ఆధ్వర్యంలో విద్యార్థినులకు శక్తి టీం ప్రాధాన్యత, యాప్‌ల గురించి వివరించారు. 112, 1930, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, ర్యాగింగ్ సమయంలో ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు



ఉయ్యాలవాడ ఎంపీపీ పాఠశాలలో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ: మండలంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం దశల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1 రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం ఉయ్యాలవాడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక తరగతులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 80 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల సాధారణ సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కాగా, ప్రత్యేక తరగతులు ఉదయం 8 గంటల నుంచి మరియు సాయంత్రం 4.30 వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను నియమించాలి



మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గుండె, ఊపిరితిత్తులు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, లివర్ సంబంధిత వైద్యులను తక్షణమే నియమించాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పెద్ద వైద్యానికి వైద్యులు లేక కర్నూలుకు రెఫర్ చేస్తున్నారని చెప్పారు. మంత్రి ఇలాకాలో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వైద్యులను నియమించి అవసరమైన పరికరాలను సమకూర్చి పేదలకు స్థానికంగానే అన్ని వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. నాయకులు విష్ణు, శంకర్, ఎర్రిస్వామి, మహేష్ పాల్గొన్నారు.

వర్షపు నీరు వెళ్లే మార్గమేదయ్యా



పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న బీసీ కాలనీవాసులు

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్ సమీపంలోని బీసీ కాలనీలో మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డిని నిలదీశారు. కాలనీలో మహిళలు మాట్లాడుతూ.. కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాల్వలు ఉన్నా వర్షపు నీరు వెళ్లేందుకు అనుగుణంగా లేకపోవడంతో నిల్వ చేరుతోందని తెలిపారు. దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. కాలనీ ఏర్పడి 15 ఏళ్లు గడుస్తున్నా తగిన మౌలిక వసతులు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి గ్రామ పంచాయతీకి నిధుల కొరత ఉందని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేధింపులు ఆపాలి

నంద్యాల(న్యూటౌన్): అధికారుల మాట తీరు మారాలి.. వేధింపులు ఆపాలి.. మెప్మా సీఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, యూనియన్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి హేమావతి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న మెప్మా కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘటన జరిగి 15రోజులు అవుతున్నా మెప్మా పీడీ శోభ చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, పీజీఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ చర్యలు శూన్యమన్నారు. సీఆర్పీలు ప్రసన్నకుమారి, సులోచన, సత్యవతి, సువర్ణ, మాధవి, జ్యోతి, అరుణ, భవానీ, అనిత, మహేశ్వరి పాల్గొన్నారు.

6న ఎడ్ల బండ లాగుడు పోటీలు

ఆత్మకూరు: మొహర్రం సందర్భంగా ఈనెల 6న మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో అంతర్‌రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ మొహర్రం కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 7 గంటల్లోపు ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9848614831, 6301485551 నంబర్లను సంప్రదించాలన్నారు.


పేకాటరాయుళ్లపై కేసు నమోదు

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాలు గురువారం తెలిపారు. సలాంబాషా, సమీర్‌బాషా, గొల్ల గోకారి పేకాట ఆడుతుండగా రూ.9,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల నుంచి నగదు స్వాధీనం

మహానంది: అబ్బీపురంలో పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి రూ.2,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

బేతంచెర్ల: పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు రావాలంటే ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన బేతంచెర్లలోని హరిజనవాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, హాజరు శాతం పరిశీలించారు. విద్యార్థులకు పలు విద్యా సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం పుల్లయ్య పాల్గొన్నారు.

ఇమామే హసన్, హుసేన్ పీర్ల ఊరేగింపు





చాగలమర్రిలోని అరబ్ మస్జీద్ సమీపంలోని మకానంలో కొలువు దీరిన అలీఅక్బర్ పీరు
చిన్నవంగలి గ్రామంలోని పీర్ల చావిడిలో కొలువు దీరిన ఇమామే హుసేన్, బాదుల్లా స్వామి

చాగలమర్రి : మొహర్రం వేడుకలలో భాగంగా 7వ రోజు గురువారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలోని మకానంలో కోలువు దీరిన హజ్రత్ ఇమామే హసేన్, ఇమామే హుసేన్ పీర్ల ఊరేగింపు వందలాదిగా తరలి వచ్చిన భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. పీర్లకు దారి పొడవునా భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు పోలీసు స్టేషన్ వద్ద నున్న మకానం నుంచి ప్రారంభమై మెయిన్ బజార్ మీదుగా అరబ్ మస్జీద్, చిన్నమకానంలోని లాల్‌స్వామి మకానం వద్ద ఫాతెహాలు నిర్వహించిన అనంతరం రచ్చబండ, పెద్దమకానం నుంచి మొయిన్ బజార్ మీదుగా కొనసాగింది.

కొలువుదీరిన అలీ అక్బర్ పీరు

చాగలమర్రిలోని అరబ్ మస్జీద్ సమీపంలోని చిన్న మకానం వద్ద హజ్రత్ అలీ అక్బర్ పీరును గురువారం కొలువుదీర్చారు. ఈ పీరు ఊరేగింపు శుక్రవారం రాత్రి నిర్వహిస్తారు. పెళ్లికాని యువకులు ఈ పీరు ఎత్తుకోని గుర్రం మీద గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించడం ప్రత్యేకత.



పెద్దవంగలిలోని సచివాలయంలో వెలసిన ఇమామే హుసేన్, లాల్‌స్వామి పీర్లు

గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు

మండలంలోని పెద్ద వంగలి, చిన్న వంగలి గ్రామాలలో హజ్రత్ ఇమామే ఖాశీం, హజ్రత్ బాదుల్లా, లాల్‌స్వామి పీర్లను ఆయా మకానాలలో కోలువు దీర్చారు. ఈ పీర్లను గురువారం రాత్రి చిన్న సరిగెత్తు సందర్భంగా సంప్రదాయ మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

కొలువుదీరిన పీర్లు



శిరివెళ్ల కటిక సెంటర్ మకాన్ వద్ద పీర్లు



క్రిష్టిపాడులో చావిడిలో కొలువైన పీర్లు

శిరివెళ్ల: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలో పీర్లు కొలువయ్యాయి. మండల కేంద్రంలో 4 మకాన్‌లు, యర్రగుంట్ల, గోవిందపల్లె, బోయలకుంట్ల, జీనేపల్లె, వనికినిదిన్నె, మహదేవపురంలలో పీర్లను కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు ఆయా గ్రామాల్లో చిన్న సరిగెత్తు, మధ్య సరిగెత్తు, పెద్ద సరిగెత్తు కార్యక్రమాలు జరుగుతాయి. అగ్నిగుండ ప్రవేశం, పీర్ల ఊరేగింపు చేయనున్నారు. ఈ నెల 6వ తేదీ మొహర్రం పండుగ రోజున పీర్లను భక్తిశ్రద్ధలతో చెరువులు, కాల్వలలో నిమజ్జనంతో వేడుకలు ముగియనున్నాయి.

దొర్నిపాడు: మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా వావిళ్లలో కొలువైన పీర్లకు భక్తిశ్రద్ధలతో గురువారం ఫాతెహాలు సమర్పించారు. ముఖ్యంగా క్రిష్టిపాడు, చాకరాజువేముల, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

అన్నదాత సుఖీభవ జాబితా పరిశీలన



పెండింగ్ జాబితాపై ఆరా తీస్తున్న జేసీ

శిరివెళ్ల: అన్నదాత సుఖీభవ జాబితాలోని పెండింగ్ రైతుల వివరాలను త్వరగా పరిష్కరించాలని జేసీ విష్ణు చరణ్ అన్నారు. గురువారం స్థానిక 1వ రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అన్నదాత సుఖీభవ డేటా ఎంట్రీ పనులను పరిశీలించారు. అర్హుల జాబితా, అనర్హుల జాబితాలు కాకుండా ఇతర సమస్యలతో జాబితాలో లేని రైతుల వివారాలను వారి సమాచారం, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఈకేవైసీ, ఫ్యామిలి మ్యాపింగ్ వంటి సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ జయశ్రీని ఆదేశించారు. జిల్లాలో 14,418 మంది రైతుల సమగ్ర సమాచారం అందాల్సి ఉందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో పెండింగ్ రైతుల జాబితాలకు సంబంధించిన డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఆర్‌ఐ రాఘువేంద్రం, వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

చాగలమర్రి: డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి ఆధ్వర్యంలో చాగలమర్రి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న నీటి పాత్రలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడాలన్నారు. వ్యాధి లక్షణాలున్నట్లు గుర్తిస్తే ఆరోగ్య, ఉప ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విష్ణుప్రియ, ఏఎన్‌ఎం వసంత, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలంపాట



వేలం పాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంత జూటూరు, లింగాపురం గ్రామాల ఆలయ భూముల కౌలు వేలం పాటను గురువారం గ్రూపు ఆలయాల కార్యనిర్వహణ అధికారి ఈ నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత జూటూరు చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 46.96 ఎకరాలను రూ.7,77,000, లింగాపురం ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 3 ఎకరాలను రూ.13 వేలకు రైతులు వేలంపాటలో దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి, ఎస్‌ఐ జగన్ మోహన్ పాల్గొన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ



బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువ బడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది. పట్టణానికి చెందిన బీవీ ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్‌అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమే కాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. శుక్రవారం ఆయన వంశస్తులు పట్టణంలో బీవీ సుబ్బారెడ్డి 122 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉర్దూ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ గురువారం తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఉర్దూ చదివి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 7వ తేదీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.